ఆలయ వార్షికోత్సవ వేడుకలు



బోడుప్పల్: శ్రీసాయి భవానీనగర్ కాలనీలోని స్పటిక లింగేశ్వర సహిత సీతారామాంజనేయ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆలయ ధర్మకర్త జడిగె మంజుల రమేష్‌యాదవ్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో దేవుడిని పూజిస్తే వారి కోరికలు నెరవేరుతాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తీజ్ ముగింపు ఉత్సవాలు

బోడుప్పల్: చెంగిచర్ల గోర్ బంజారా కమిటీ ఆధ్వర్యంలో తీజ్ పండుగ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, ఐపీఎస్ రాంరెడ్డినాయక్, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ సుమన్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

‘స్నేహమేర శాశ్వతం’ నాటిక ప్రదర్శన

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ, శారద ఆర్ట్స్ అసోసియేషన్ వారి సంయుక్తాధ్వర్యంలో సోమవారం మల్లాపూర్ నెహ్రూనగర్ హనుమాన్ దేవాలయం వద్ద ‘స్నేహమేర శాశ్వతం’ అనే సందేశాత్మక నాటికను ప్రదర్శించించారు. నాటికలో మాదుగుల కృష్ణమోహన్, నటి మణి మనుప్రియ, ఐరేని రమేష్‌గౌడ్, సత్యనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో మొదటి, రెండో విడత కౌన్సెలింగ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హనుమానాయక్ తెలిపారు. వివిధ ట్రేడ్‌లలో మేడ్చల్ ఐటీఐ, ఏటీసీలలో సీట్లు ఖాళీగా ఉన్నాయని గతంలో పేర్లు నమోదు చేసుకున్న వారు, చేసుకోని వారు నేరుగా సంప్రదించి ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రకటించారు. ఈనెల 28లోగా సీట్ల భర్తీ ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు ఆలోగా ఆసక్తి, అర్హత ఉన్నవారు ఐటీఐలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ స్కూల్‌లో టీఎల్‌ఎం మేళా

శామీర్‌పేట్: విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని మండల విద్యాధికారి కమలాకర్ అన్నారు. తూంకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీఎల్‌ఎం మేళాను మండల విద్యాధికారి కమలాకర్ సోమవారం ప్రారంభించారు. శామీర్‌పేట మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు టీఎల్‌ఎం మేళాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి కమలాకర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి, విద్యాబోధన చేయాలని సూచించారు. స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు నాగశారద, ఉపాధ్యాయులు వెంకట్రాంరెడ్డి, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఘనంగా నిర్వహించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు నిర్వహించుకునేలా అన్ని శాఖల విభాగాల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్లు హేమంత్, అపూర్వ్, అడిషనల్ డీసీపీలు పురుషోత్తం, సుదర్శన్, స్పెషల్ బ్రాంచ్ అధికారి రెహమాన్, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి జిల్లావ్యాప్తంగా 17 చెరువులలో పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవడంతో పాటు అవసరమైన రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రూట్లలో రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తిచేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్‌శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అవసరం మేరకు వైద్య శిబిరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించాలని పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో విషాద-చాయలు !

కృష్ణాష్టమి రథోత్సవంలో విద్యుదాఘాతంతో ఐదుగురి మృతి

- కుటుంబసభ్యుల బంధువుల రోదనలు
- పరామర్శించిన ఎమ్మెల్యేలు, వలు పార్టీల నాయకులు
- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్



ఆందోళనలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్ : గోకుల్‌నగర్‌లోని యాదవ సంఘం, స్థానిక యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహించే విధంగానే ఈసారి కూడా ఆదివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రథోత్సవం పలు పుర వీధుల్లో ఊరేగించారు. అర్ధరాత్రి స్థానిక ఆర్టీసీకాలనీ చౌరస్తా వద్ద రథాన్ని లాగేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం చెడిపోవడంతో యువకులంతా కలిసి రథాన్ని చేతులతో లాగుతూ ముందుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే పైన ఉన్న హైటెన్షన్ వైర్లపై వేలాడుతున్న కేబుల్‌వైర్ నుంచి ప్రసరించిన విద్యుత్ రథం గోపురానికి తగిలి రథాన్ని లాగుతున్న పదిమంది యువకులు విద్యుదాఘాతానికి గురై చెల్లాచెదురుగా పడిపోయారు. దీంతో అప్రమత్తమైన స్థానికులు, కాలనీవాసులు హుటాహుటిన వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించగా.. ఐదుగురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆందోళనలు

విద్యుదాఘాతంతో మృతి చెందిన యువకుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలంటూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలతో పాటు మృతి చెందిన యువకుల కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున ఆందోళకు దిగి రాస్తారోకో నిర్వహించారు.

మృతుల కుటుంబ సభ్యుల రోదనలు

ఈ దుర్ఘటనలో ఓల్డ్ రామంతాపూర్‌కు చెందిన పింజర్ల కృష్ణయాదవ్ (21) చిట్టబోయిన సురేష్‌యాదవ్ (34) కాటేపల్లి శ్రీకాంత్‌రెడ్డి (45), హబ్సిగూడకు చెందిన రుద్ర వికాస్ (39), రాజేందర్‌రెడ్డి (45) ఉన్నారు. వారి కుటుంబాలు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటిపోయాయి.

క్షతగాత్రులకు పలు ఆసుపత్రుల్లో చికిత్స..

మిగిలిన క్షతగాత్రులను నగరంలోని గాంధీ ఉస్మానియాతో పాటు ఇతర ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేర్పించారు. గాయపడిన వారిలో గోల్నాక నివాసి గణేష్ (21) ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గాయపడిన వారికి మెరుగైన చికిత్సను అందిస్తున్నామని డాక్టర్లు చెబుతున్నారు.

పరామర్శించిన స్థానిక ఎమ్మెల్యేలు, నేతలు

మృతుల కుటుంబాలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్‌తో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డిలు పరామర్శించారు. కుటుంబాలకు కోటి నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం కారణంగానే ఎంతో భవిష్యత్తు ఉన్న ఐదుగురు యువకులు బలయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న కేబుల్ విద్యుత్ వైర్లను తొలగించాలని స్థానిక ప్రజలు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని ప్రమాదం జరిగిన తర్వాత అర్ధరాత్రి ఆగమేఘాల మీద విద్యుత్ వైర్లు, కేబుళ్లను తొలగించారని ధ్వజమెత్తారు.



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు తలసాని, కాలేరు, ముఠా గోపాల్



సాక్షిలో ప్రచురితమైన కథనం

ముందే హెచ్చరించిన సాక్షి..

రామంతాపూర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై కేబుల్, ఇంటర్నెట్ వైర్లు కిలోల కొద్ది వేలాడుతూ స్తంభాలు ఒంగిపోతూ.. ప్రమాదకరంగా మారాయని, ఆ వైర్లు విద్యుత్ వైర్లు పడి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఆదివారం సాక్షి దినపత్రికలో ‘విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త’ అనే కథనం ఉప్పల్ మల్కాజిగిరి జోన్ పేజీలో ప్రచురితమైంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ



కార్పొరేటర్ సునీతకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

మౌలాలి : డివిజన్ పరిధి పలు కాలనీల్లో నెలకొన్న ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆమె గ్రీన్‌హిల్స్, ఎంజే కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. హిల్‌వ్యూ అపార్ట్‌మెంట్ వాసులు పలు సమస్యలపై కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రసాద్‌చౌదరి, శాంతరామ్, సాయిబాబా, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మా పంట భూమిని కాపాడండి !

కలెక్టర్ మనుచౌదరికి రైతు ఫిర్యాదు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఖాజిగూడ రెవెన్యూ శివారులో 12 నుంచి 17, 20, 25 వరకు ,33 నుంచి 36 గల సర్వే నెంబర్లలో 1.30 ఎకరాల పంట భూమి పక్కన ఉన్న ఇతర భూములను కొనుగోలు చేసిన పలువురు వ్యక్తులు దౌర్జన్యంగా తన పంట భూమిని ఆక్రమించుకుని భవన నిర్మాణాలు చేపడుతున్నట్లు బాధిత రైతు ఆరోపించాడు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ మనుచౌదరికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. లే అవుట్ చేసిన సదరు 13.38 ఎకరాల భూమిలో 7 ఎకరాల వరకు లింగాయకుంట చెరువుకు సంబంధించిన ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ భూములు ఉన్నట్లు ఆయన తెలిపారు. హెచ్ఎండీఏ మ్యాప్‌లో కూడా లే అవుట్ చేసిన భూములు లింగాయకుంట చెరువు పరిధిలో ఉన్నట్లు చూపిస్తున్నప్పటికీ, అక్రమంగా అనుమతి పొందడంతో పాటు అడ్డుకునేందుకు వెళ్లిన తన కుటుంబసభ్యులపై దాడిచేసి, భవన నిర్మాణాలు చేపడుతున్నారని బాధితుడు ఆరోపించాడు.

కోర్టు ఆదేశాలు పట్టించుకోవడం లేదు..

సదరు స్థలంలో భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, భూమి స్వరూపాన్ని మార్చకుండా చూడాలని సంబంధిత గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించినా.. పట్టించుకోవడం లేదని వాపోయాడు. సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన డాక్యుమెంట్లు, పత్రాలను కలెక్టర్‌తో సహా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖ అధికారులకు అందజేసినట్లు వివరించారు.

గంజాయి స్వాధీనం

పోలీసుల అదుపులో ఒకరు, మరో నిందితుడి పరార్

పోచారం: రూట్ వాచ్ చేస్తున్న ఘట్‌కేసర్ ఎక్సైజ్ పోలీసులకు ఓ నిందితుడు గంజాయితో చిక్కాడు. ఇన్‌స్పెక్టర్ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం.. చెర్లపల్లి నుంచి చెంగిచర్లకు వెళ్లే రహదారిపై రూట్ చేస్తున్న పోలీసులకు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వాహనం నడుపుతున్న కిషోర్ మల్లిక్ (31)ను పోలీసులు అదుపులోకి తీసుకోగా.. వెనకకూర్చున్న అబ్దుల్‌ముజీబ్ (27) ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. వాహనాన్ని తనిఖీ చేయగా.. పెట్రోల్ ట్యాంక్‌పై ఉన్న బ్యాక్‌ప్యాక్ బ్యాగులో ఎండు గంజాయి లభ్యమైంది. అదుపులో ఉన్న కిషోర్‌మల్లిక్‌ను ప్రశ్నించగా.. తాను ఒడిశాలోని మల్కాజిగిరికి చెందిన వ్యక్తినని, ఒడిశా నుంచి ఎండు గంజాయిని కొనుగోలు చేసి, బస్సులో హైదరాబాద్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు చెప్పాడు. మరో నిందితుడు ముజీబ్ నగరంలోని మౌలాలిలో ఉంటున్నట్లు సమాచారం. ముజీబ్‌పై గతంలో ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఘటనా స్థలంలో లభించిన 4.900 కిలోల ఎండు గంజాయి, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు.



పోలీసు స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు అదుపులో ఉన్న నిందితుడు

వెళ్లేందుకు దారేది.. ?

కాలనీకి దారి కల్పించాలని తూంకుంట మున్సిపల్ ఎదుట ధర్నా

శామీర్‌పేట్: తమ కాలనీకి దారి కల్పించాలని రెడ్డి కాలనీవాసులు సోమవారం తూంకుంట మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తూంకుంట రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 286, 322లలో సుమారుగా 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గత 2 నెలల క్రితం కొందరు వ్యక్తులు వెంచర్‌లో ఉన్న దారిని మూసివేసి, బోరు వేసి మామిడి చెట్లు నాటారని ఆరోపించారు. తమ కాలనీకి దారి లేకుండా చేశారని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చామని, ఇంతవరకు స్పందించలేదని వాపోయారు. కబ్జాకు గురైన రోడ్డుకు తిరిగి దారి కల్పించాలని అధికారులను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజాదర్బార్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

పనులను వినూత్నంగా చేయడమే ఇంజినీరింగ్

పోచారం: ఇంజినీరింగ్ అంటే సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టడం మాత్రమే కాదని, పనులను భిన్నంగా చేయడమని మైక్రోసాఫ్ట్ ఇండియా పరిశోధన విభాగం మేనేజర్ ముఖేష్ కుమార్ అన్నారు. సోమవారం యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో నూతనంగా చేరిన బీటెక్ విద్యార్థులకు జరిగిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొన్ని దశాబ్దాల కృషి ఫలితంగా ఇంజినీరింగ్ రంగం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలు సాధించిన ప్రగతితో ప్రపంచంలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. ప్రపంచంలోని 66 శాతం ప్రజలు ఇంటర్నెట్, 96 శాతం ప్రజలు మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారన్నారు. శరవేగంగా విస్తరించిన సాంకేతిక రంగమే ఈ శుభపరిణామానికి కారణమన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సును అన్ని రంగాల్లో వినియోగిస్తున్నారన్నారు. శ్రీనిధి విద్యాసంస్థల సీఈఓ అభిజిత్‌రావు, ప్రిన్సిపాల్ డా.టీ.సీహెచ్.శివారెడ్డి, అకడమిక్స్ డీన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

కీసర రామలింగేశ్వరస్వామికి నాగాభరణం విరాళం



నాగాభరణం అందజేస్తున్న నర్సింహ్మారెడ్డి దంపతులు ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు

కీసర: శ్రావణమాసోత్సవ ప్రత్యేక పూజల్లో భాగంగా కీసరగుట్ట రామలింగేశ్వరస్వామివారికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం ఆలయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం అర్చకులు పంచామృత, ఫలరసాభిషేకం పూజలతో పాటు, బిల్వార్చన పూజలను కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి రూ 6.5 లక్షల విలువ చేసే బంగారు తాపడం నాగపడిగే అందజేశారు.

◆ నగరంలోని తాడ్బండ్‌కు చెందిన సదా నర్సింహ్మారెడ్డి పుష్పలత దంపతులు రూ 6.5 లక్షల విలువ చేసే బంగారు తాపడం గల నాగాభరణం (నాగ పడిగేలు) విరాళంగా అందజేశారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు కొకుట్ల కృష్ణారెడ్డి, కందాడి రాజిరెడ్డి, నల్లమధుసూదన్‌రెడ్డి, ప్రవీణ్‌ముదిరాజ్, రాజుయాదవ్, ఆలయ ప్రధాన అర్చకులు బలరాంశర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో వినూత్న నిరసన

మల్కాజిగిరి: సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేటర్ వినూత్నంగా నిరసన తెలిపారు. సోమవారం ప్రజావాణిలో డిప్యూటీ కమిషనర్ లేకపోవడంతో ఖాళీ కుర్చీకి దండం పెట్టి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం పురస్కరించుకుని ఇప్పటికీ ప్రధాన కార్యాలయం, జోనల్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, కమిషనరేట్ కార్యాలయాల్లో మీటింగ్‌లు నిర్వహించారన్నారు. మీటింగ్‌ల పేరును కాలయాపన తప్ప నిమజ్జనఘాట్‌కు సంబంధించి లేదా ఇతర పనులు జరుగుతున్న దాఖలాలు లేవన్నారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని తెలిసినా.. ఇతర సమావేశాలు నిర్వహించడం సరికాదన్నారు.



డీసీ ఖాళీ కుర్చీకి దండం పెడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

సర్కిల్ కార్యాలయంలోనే అన్ని విభాగాల అధికారులతో మరోసారి పూర్తిస్థాయి సమావేశం నిర్వహించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలకసంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. 8 దరఖాస్తులు అందాయని, మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారం దిశగా అడుగులేయాలని కమిషనర్ త్రిలేశ్వర్‌రావు మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మున్సిపల్ పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఫెల్ కాలనీలో సమస్యలు పరిష్కరిస్తా



స్థానికులతో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: సీఫెల్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. సోమవారం కాలనీలో పర్యటించిన ఆయన పనులు పూర్తయిన సీసీరోడ్డును పరిశీలించారు. అనంతరం కాలనీవాసులతో స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని వీధుల్లో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ, అదనపు స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే అధికారులను తీసుకొచ్చి ప్రతిపాదనలు సిద్ధం చేయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణ, ఓంరాజ్, సుస్మిత, చంద్రకాంత్, భానుప్రకాష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పాదయాత్ర

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్, ఎరుకుల బస్తీలలో సోమవారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ పాదయాత్ర చేపట్టారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు వేయాలని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు కార్పొరేటర్ ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ.. త్వరలోనే భూగర్భ డ్రైనేజీలు, సీసీరోడ్లు వేయిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్, ఏఈ వినిత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, శివ, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శాంతి

సర్వాయి పాపన్నగౌడ్‌కు ఘన నివాళి



చిలుకానగర్‌లో..



అల్వాల్‌లో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మైనంపల్లి

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం, సామాజిక, రాజకీయ సమానత్వం కోసం పోరాడిన యోధుడని పలువురు కొనియాడారు. యువత ఆయన చూపిన దారిలో నడవాలని సూచించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం



గౌతంనగర్‌లో కార్పొరేటర్ మేకల సునీత



పాపన్న జయంతి వేడుకల్లో మాజీ మేయర్ అజయ్‌యాదవ్



ఈసీఐఎల్‌లో గౌడసంఘం ఆధ్వర్యంలో..